

# వారధి

వేములపల్లి రాధిక

"నువ్వీదరిని – నేనాదరిని
కృష్ణమ్మ కలిపింది మన ఇద్దరిని"

టీ.వి.లో వస్తున్న పాట చూడగానే మా అమ్మాయి కేక వేసింది మమ్మీ! నీ కిష్టమైన పాట వస్తోంది రా అని. నన్నలా ఆటపట్టించడం మా పిల్లలకి సరదా. వాళ్ళకేం తెల్సు? కృష్ణ కిరుప్రక్కలా పుట్టినిల్లు, మెట్టినిల్లు అవడంతో నేను పడ్డ బాధలు ఎన్నని చెప్పను? అసలా కష్టాలు వాళ్ళకి అర్థం అవుతాయని కూడా నేను అనుకోను. ఎందుకంటే దాదాపు ఇరవై ఏళ్ళ క్రితానికి ఇప్పటికీ పరిస్థితులెంతో మారాయి.

దాదాపు కృష్ణా జిల్లాలో దివిసీమ, బందరు, ఇటు పామర్రు వరకు ఉన్న ప్రజానీకం అందరికీ ఎక్కువ శాతం బంధాలు, బంధుత్వాలు గుంటూరు జిల్లాలోని రేపల్లె, కొల్లూరు మొదలుకొని తెనాలి వరకూ ఉండటం సామాన్యం. అయితే ఇబ్బంది మాత్రం మధ్యలో ఉన్న కృష్ణానది పాయతోనే. అది వారి జీవితాల లో ఒక భాగమైపోయింది. దివిసీమలో ఉన్న పెద్దవాళ్ళని ఏ ఒక్కరినైనా కదిలించండి మీరు చనిపోయే లోగా చూడాలనుకున్నది ఏమిటని? టకీమని చెప్తారు ఏటిమీద వంతెన పడటం అని. అంటే వాళ్ల ఉద్దేశం పులిగడ్డ – పెనుమూడి వారధి అని నేను పులిగడ్డ – పెనుమూడి ప్రయాణం చేసిన ప్రతిసారి సహప్రయాణీకుల్లో ఎవరో ఒకరి నోటి నుండి ఆ కోరిక విన్నాను. ఆ వారధి కోస్తా ప్రజల చిరకాల స్వప్నం. నిజంగా అది వారి కలే నిజం కాబోతున్న కల.

మా అమ్మమ్మ వాళ్ళ పుట్టిల్లు ఏటి అవతల రేపల్లె. అయితే మేనమామకే ఇచ్చి పెళ్ళి చేయడంతో ఆమె ఏటి ఇవతల ఉన్న చల్లపల్లికి కాపురానికి వచ్చింది. మళ్ళీ తరవాత తరంలో మా పెద్దమ్మను ఏటి అవతల ఉన్న మేనమామకు (అమ్మమ్మ తమ్ముడు) ఇచ్చి చేయడంతో మా అమ్మమ్మకు పుట్టిల్లు, కూతురి అత్తారిల్లు ఒకటే కావడంతో ఏటి మీది అటూ ఇటూ తిరగటానికి ఎంతో శ్రమ పడాల్సి వచ్చేది. ఇంతకీ అందులో కష్టం ఏమిటా అనుకుంటున్నారు కదూ? తెలియని వాళ్ళు అలా అనుకోవడంలో ఆశ్చర్యం లేదు లేండి.

ఏటి మీద ప్రయాణం అంటే తెల్లవారు జామున 4గం.లకే ప్రయాణమై 6గం.ల లోపు మన ఊరి నుంచి బస్సులో పులిగడ్డ చేరుకోవాలి. ఎందుకంటే ఎండన పడ్డామా ఇక మనం పెనుమూడి చేరాలంటే అరికాళ్ళు బొబ్బలెక్కాల్సిందే. ఎందుకంటే ఇప్పుడైతే లాంచీలు తిరుగుతున్నాయి కానీ ఆ రోజుల్లో రాదారి (రహదారి) పడవలే. అంటే దారి అంతా ఇసుకలో నడుస్తూ మధ్య మధ్య వచ్చే కృష్ణా పాయ చీలికల్ని పడవలో దాటడం అన్నమాట. మొత్తం కృష్ణానది దాదాపు మూడు కిలోమీటర్ల దూరం అంతా నదిలో నీరుండదు. పులిగడ్డ ఒడ్డున ఒక పాయను పడవలో దాటగానే చాలా దూరం ఇసుకలో నడవాలి. అంతా రెల్లు పొదలతో నిండి

ఉంటుంది. వానాకాలంలో ఐతే ఆ రెల్లు పొదలు ఎత్తుగా పెరిగి మనుష్యులు నడుస్తున్నా కన్పించనంతగా కప్పేస్తాయి. ఇసుకలో నడవాలంటే ఎంత దొరబాబులైనా సరేనేల తల్లికి కాళ్ళప్పగించాల్సిందే. చెప్పులు, బూట్లు ఏవీ పనికి వచ్చేవి కావు. కూరుకుపోయే కాళ్ళను లాక్కుంటూ చేతుల్లో ఉన్న సంచులను మోస్తూ, వగరుస్తూ నడిచే ప్రతి వ్యక్తీ నాకింకా గుర్తుకొస్తూనే ఉంటారు. ఇసుకలో కొంత దూరం నడవగానే మళ్ళీ మధ్యలో ఇంకొక చిన్న నీటి ప్రవాహం. అక్కడ మళ్ళీ పడవ ఎక్కి ఆ పాయను దాటాలి. తరువాత ఏటవాలుగా ఉండే కాలిబాటపై కెక్కి; నది మధ్యలో బయట పడిన దిబ్బ నెక్కాలి. అక్కడికి చేరుకోగానే అందరూ సగం భారం తొలగి పోయినట్లు నిట్టూర్చేవారు. ఎందుకంటే దిబ్బపైన నడవడం మామూలుగా ఉండేది. శ్రమ పడక్కర లేదు. ఆ దిబ్బపై కంది చేలు, జామ తోటలు, సరుగు చెట్లు ఉండేవి. రేపల్లె దాటి దూరం వెళ్లే వాళ్లు కొంతమంది అక్కడ ఆగి తాము తెచ్చుకున్నవేమైనా ఉంటే తిని వెళ్ళేవారు. దిబ్బ దిగిన తరువాత మళ్ళీ కొంత దూరం కాళ్ళు కూరుకు పోయే ఇసుకలో నడిస్తే ఇంకొక చిన్న జల ప్రవాహం. అది దాటాలంటే మళ్ళీ పడవ ఎక్కి దిగాలి. అప్పుడు కానీ మనం పెనుమూడి ఒడ్డుకు చేరం. మళ్ళీ పెనుమూడి నుండి రేపల్లె రిక్షా ప్రయాణం అరగంట సేపు ఈడ్చుకుంటూ సాగేది. రేపల్లె చేరుకున్న తర్వాత తెనాలి వరకు వెళ్ళాల్సిన వాళ్ళైతే మళ్ళీ రైల్లో, బస్సో పట్టుకుని ప్రయాణం కొనసాగించాల్సిందే.

మా అమ్మమ్మ చుట్టరికాలు ఆవిడ పుట్టిల్లు రేపల్లె కావడంతో అన్నదమ్ములు, బాబాయ్‌లు, వాళ్ల పిల్లలు అందరూ రేపల్లె అవడంతో ఆవిడతో పాటు మాకూ ఆ ప్రయాణం అలవాటయ్యింది.


మా నాన్న తరపు కొస్తే మా తాతయ్య (నాన్న నాన్న) సొంత ఊరు గుంటూరు జిల్లాలేని ఓలేరు. మా తాతయ్య కృష్ణాజిల్లాలో పులిగడ్డ ఆక్విడక్ట్ కట్టే సమయంలో దివిసీమలో సేద్యం బాగా జరుగుతుందనే ముందు చూపుతో ఓలేరులో పొలాలన్నీ అమ్మి కృష్ణాజిల్లా దివి సీమలో పొలాలు కొని స్థిరపడిన పెద్దమనిషి. మా నాయనమ్మ కన్నారిల్లు కూడా గుంటూరు జిల్లా తూర్పుపాలెం. ఓలేరు, తూర్పుపాలెం

ఇవన్నీ రేపల్లె దగ్గర వూళ్లే. మొన్నీ మధ్య మేము టుప్రక్క నుండి వస్తుంటే చూశాం ఆ వూళ్లని. మా తాతయ్య చనిపోయాక మా నాయనమ్మ బందరులో ఉంటుంది మా అమ్మా నాన్నల దగ్గర. 95సం.ల వయస్సులో కూడా ఆవిడకు ఇంకా పుట్టిన వూరుపై మమకారం. ఇప్పుడు మీ వూర్లో మన చుట్టాలెవరూ లేరని చెప్పినా సరే వంతెన పడగానే నన్నొక్కసారి బస్సులో ఏటి అవతల ప్రక్కకి తీసుకెళ్ళవే అమ్మాయి అని పోరుతూ వుంటుంది. ఈ వయస్సులో ఆవిడకేం తెలుసు అనుకుంటున్నారేమో! ఇప్పటికీ ప్రతిరోజూ డైలీ పేపర్ చాలా ఆసక్తిగా చదువుతుంది. జిల్లా స్పెషల్‌లో పులిగడ్డ-పెనుమూడి వారధి గురించి జరిగిన రాజకీయ రభసలు, వాగ్వివాదాలు చాలా టెన్షన్‌గా ఫాలో అయ్యే ఆ ముసలమ్మ, సెలవులకు నేను వెళ్లగానే నాతో డిబేటు మొదలు పెట్టేది అసలు వీళ్లు వంతెన కడతారా లేదా అని.

ఇకపోతే, అసలు కథ నా కథ మీ కసలు చెప్పనే లేదు కదూ! మూడో తరం మేనరికం కొనసాగింపు మా అమ్మమ్మ మనవరాలినైన నన్ను అమ్మమ్మ చెల్లెలి కొడుక్కి ఇచ్చి చేయడంతో జరిగింది. మా అమ్మా నాన్న లిద్దరూ ఎంప్లాయీస్ కావడం, అందులో ఇంటికి పెద్ద కూతుర్నని అతి సుకుమా

**ఆ నిర్జన ప్రదేశంలో సరుగుతోటలు, కందితోటలు, రెల్లు దుబ్బుల మధ్య ఎంతో భయంతో పరుగెత్తుతున్నట్లు నడిచేవాళ్లం. జంటగా వెళితే నన్నెంతో ఆహ్లాదపరచే అదే ప్రకృతి ఒంటరిగా వెళ్ళేటప్పుడు భయపెట్టేది. అయితే ఈ భయాన్ని పక్కన పెడితే మాత్రం ఏ మాత్రం ఈస్తటిక్ సెన్స్ వున్న వాళ్ళైనా పులకించిపోయే విధంగా వుండేది వాతావరణం.**

రంగా పెంచారేమో, పోయి పోయి ఒక్కసారే ఆ ఏటి మీద ప్రయాణాలు కొన సాగించడమంటే నా పని ఏటికి ఎదురీదడమే అయింది. అప్పటి వరకు ఇల్లు, కాలేజి తప్ప లోకజ్ఞానం శూన్యం. నిండా పదిహేడేళ్ళు లేని వయస్సులో పెళ్లయిన వెంటనే మమ్మల్ని కారులో బందరు నుండి విజయవాడ-తెనాలి-కొల్లూరు మీదగా రేపల్లె పంపారు. ఒక పూట పట్టింది ఆ ప్రయాణం. రిసెప్షన్ తరువాత ఏటి మీదుగా తిరుగు ప్రయాణం. ఆదిలోనే హంస పాదు అన్నట్లుగా పడవ ఎక్కేలోగానే నా చేతిలో వున్న ఫారెన్ కెమేరా ఎవరో కొట్టేయడంతో అంతా వెదికారు. నీళ్లల్లో పడిందేమోనని ఈతగాళ్లను పెట్టించి వెదికినా దొరకలేదు. పెళ్లయిన వెంటనే అదే మొదటి చేదు అనుభవం. సరే ఎలాగోలా వచ్చాం. తరువాత రాకపోకలు సాగిస్తుంటే అర్థమయ్యింది ఏటి మీద ప్రయాణం ఎంత కష్టమో. కాపురానికి పంపేటప్పుడు చలిమిడి క్యాను మోసిన మా పిన్ని ఇవ్వాల్టికి కూడా గుర్తొచ్చినప్పుడల్లా తల చుకుంటుంది. ఏటిలోనేమో కాలు కూరుకుపోయే ఇసుక. బందరు నుండి వచ్చేసరికి పది గంటలయ్యిందేమో నెత్తిన ఎండ మాడ్చేస్తుంది. చెప్పులు చేత్తో పట్టుకుని మంటలెత్తే ఇసుకలో, వట్టి కాళ్లతో నడుస్తూ చలిమిడి క్యాను బరువు మొయ్యాలంటే ఎంత కష్టమో ఊహించండి. అట్లా తంటాలు పడుతూ ఎలాగోలా నిదానంగా వెళదామంటే వెనకబడి పోతామేమో, ఒక్కళ్లమే అవుతామని భయం. కర్మకాలి వెనకబడ్డామా తర్వాత పడవ వాళ్ళు అరగంట దాకా రారు అందుకే ఆడవాళ్లం ఒక్కళ్ళమే వెళ్ళేటప్పుడు మా ముందు వెళ్ళేవాళ్ళు కనీసం కనుచూపు మేరలో ఐనా కన్పించేట్లుగా జాగ్రత్త పడేవాళ్ళం. ఆ నిర్జన ప్రదేశంలో సరుగుతోటలు, కందితోటలు, రెల్లు దుబ్బుల మధ్య ఎంతో భయంతో పరుగెత్తుతున్నట్లు నడిచేవాళ్లం. జంటగా వెళితే నన్నెంతో ఆహ్లాదపరచే అదే ప్రకృతి ఒంటరిగా వెళ్ళేటప్పుడు భయపెట్టేది. అయితే ఈ భయాన్ని పక్కన పెడితే మాత్రం ఏ మాత్రం ఈస్తటిక్ సెన్స్ వున్న వాళ్ళైనా పులకించి పోయే విధంగా వుండేది వాతావరణం. రెల్లు పొదలతో, తడితడిగా వున్న అక్కడి ఇసుకలో ఆటలాడే పక్షుల్ని చూస్తూ ఆ ఏటి మధ్య అలా ఎంత సేపైనా ఉండాలని అన్పించేది. మొత్తానికి ఈ ఏటి ప్రయాణానికి నేను అలవాటు పడేలోపు పిల్లలు పుట్టుకొచ్చారు. ఇహ అప్పుడు మొదలైంది సరికొత్త సన్నాహం. నేను మా పుట్టింటికి వెళ్ళాలన్నా, తిరిగి అత్తగారింటికి రావాలన్నా నేను కాక ఇంకో ఇద్దరు ఖచ్చితంగా వుండాల్సిందే. మా వారు గాని, మా తమ్ముడు కాని వచ్చేవారు. నాన్నగారు పంపేట





మల్లిక

మల్లికా షెరావత్‌కి జీవితమొక ఛాలెంజ్. హర్యానాలోని ఒక చిన్న టవున్‌లో పుట్టి గాడ్‌ఫాదర్స్ ఎవరూ లేకుండా బాలీవుడ్‌లో నెగ్గుకురావడమంటే మాటలు కాదు. అందాలన్నీ చూపడం వల్లే మల్లికా ఎదిగిందని ఎవరైనా అంటే మల్లికా ఒప్పుకోదు. "పూర్తినగ్నంగా నటించడానికి ఎందరో సిద్ధంగా వున్నారు. మరి వాళ్ళంతా పైకిరాలేదేం" అని ప్రశ్నిస్తోంది. మల్లికాకి సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువ. ఎవరినైనా ఇట్టే అనుకరిస్తుంది. లైట్‌బాయ్ దగ్గరనుంచి జాకీచాన్ వరకు అందరి మేనరిజమ్స్ ఇట్టే అనుకరిస్తుంది.

ప్పుడు నన్ను, తమ్ముడ్ని ఆఫీసులో అటెండర్ని తోడిచ్చి పంపేవాళ్లు. పిల్లల్ని మోస్తూ వాళ్ల కవసరమైన సామాన్లున్న తట్ట,బుట్టలు మోసుకుంటూ ఆ రేవులో, కాలే ఇసుకలో పడీపడీ నడిచే సమయంలో నేను ఇంకెప్పుడూ పుట్టింటికెళ్ళ కూడదని అనుకునేదాన్ని. కానీ షరా మామూలే.నెలకో, రెండ్నెల్లకో మా నాన్నో, తమ్ముడో తీసుకెళ్ళడానికి రాగానే మళ్ళీ పరుగు. అయితే ఈ క్రమంలో మా నాన్నగారి ఆఫీసులో అటెండరుగా చేసే ఏడుకొండలు జీవితమే మారి పోయింది. అదెలా అంటే వాళ్ళ అత్తగారిల్లు రేపల్లెలోనే. అయితే కట్నం డబ్బు పూర్తిగా ఇవ్వలేదని కొండలు నాన్న కోడల్ని కాపురానికి రానివ్వలేదు. మా వెంట రేపల్లె వచ్చినప్పుడల్లా కొండలు చిన్నమ్మా! మా అత్తగారింటికి వెళ్ళి వస్తానని చెప్పి వెళ్లేవాడు. నాన్నగారికి ఈవిషయం తెల్సి ఏడుకొండలు వాళ్ళ నాన్నను పిలిచి కోడల్ని తీసుకు రమ్మని కేకలు వేశారు. అలా మా ప్రయాణం ఫలితంగా కొండలు కాపురం చక్కబడింది.

ఏడేళ్ళ వయస్సప్పుడు నా కొడుకు పరుగెత్తుతూ పడవ ఎక్కబోతూ నీళ్ళల్లో పడిపోవడంతో నేను చుట్టుతిరిగి అంటే విజయవాడ మీదుగా దూరమైనా సరే బస్సులోనే వెళ్దామని గొడవ చేయడంతో కొన్నాళ్ళపాటు మా పడవ ప్రయాణానికి బ్రేక్ పడింది. ఆ రోజు తలచుకుంటే నాకిప్పటికీ భయమే. పడవతను వెంటనే దూకి నా బిడ్డను బయటకి తీయకపోతే అని తలచుకుంటే నాకింకా ఒళ్ళు జలదరిస్తూనే ఉంటుంది. తర్వాత తర్వాత నిదానంగా మోటారు బోట్లు మొదలవడంతో నడిచే బాధ తప్పింది. ఇంతలో డి. ఎస్సీలో లోకల్ కేటగిరీలో కృష్ణాజిల్లాలో క్వాలిఫై అయిన నాకు చల్లపల్లిలో ఉద్యోగం రావడంతో కథ మలుపు తిరిగింది. నేనూ,పిల్లలూ చల్లపల్లిలో మా వారు, అత్తగారు రేపల్లెలో వారం వారం ఆయన వచ్చి వెళ్లేవారు. మధ్యలో ఈ కృష్ణానదిపై బ్రిడ్జి ఉన్నట్లయితే రోజూ వెళ్ళి రాగలిగేంత దూరమే కదా అని ఎన్నో సార్లు బాధపడ్డాం. ఈ తిరుగుడు, పిల్లల బెంగ భరించలేక ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ప్రస్తుతం ఒకే జిల్లాలో ఒకే చోట ఉంటున్నాం. బ్రిడ్జి నిర్మాణం మొదలైన దగ్గర్నించి మా వారు ఏరోజు పేపర్లో దానికి సంబంధించిన విషయాలు వచ్చినా వెంటనే చదివి ఇంట్లో అందరికీ విన్పించడం మొదలు పెట్టారు. శంకుస్థాపన రోజు పులిగడ్డ కూడా వెళ్లి వచ్చారు. తొంభై ఐదేళ్ళ మా నాయనమ్మ నుండి పదేళ్ల నా సుపుత్రుడి వరకూ అందరూ పులిగడ్డ-పెనుమూడి వారధి పై ప్రయాణం చేసే రోజు కోసం ఎదురు చూస్తున్నారు. మొన్న జనవరి14న ఓపెనింగ్ అని ప్రకటన వస్తే తండ్రీకొడుకులు రెడీ అయ్యారు బైక్ మీద వెళ్ళి రావడానికి. కానీ అప్రోచ్ రోడ్డు వివాదంతో ఓపెనింగ్ జరగకపోవడతో ఉసూరుమంటూ వెనుతిరిగి వచ్చారు. మా వారైతే పులిగడ్డ మీదగా ఏవూరు వెళ్ళాల్సి వచ్చినా లోపలికి వెళ్ళి ఆ వారధిని ఒకసారి చూసి వెనుతిరుగుతారు. నేను నవ్వితే చిన్నబుచ్చుకుంటారు. పైకి నవ్వినా నాకన్పిస్తుంది ప్రజల మనోభావాలతో, సామాన్యుల భావోద్వేగాలతో రాజకీయ నాయకులకేం పని వాళ్ళ స్వలాభం తప్ప. ఏమైతేనే విశాఖ నుండి గుడివాడ వరకూ మొత్తం కోస్తా తీరాన్నుండి విజయవాడ జంక్షన్ వైపు మళ్ళకుండా తక్కువ కిలోమీటర్లతో షార్ట్‌కట్ మార్గంలో బాపట్ల వద్ద మద్రాసు మార్గాన్ని కలిపే ఈ పెనుమూడి-పులిగడ్డ వారధి నిర్మాణం పూర్తయినా మోక్షం లభించలేదు. ఇటు కృష్ణాజిల్లా ముఖ్యంగా దివిసీమ ప్రజలు అటు గుంటూరు జిల్లా ప్రజలు ఎంతో ఉద్వేగంగా ఎదురు చూస్తున్న ఆ శుభ ముహూర్తం ఎప్పుడో వేయి కళ్లతో వేచి చూద్దాం.

*(పులిగడ్డ-పెనుమూడి వారధి నిర్మాణానికి రాళ్లెత్తిన వారికి, ఎప్పుడు ప్రారంభిస్తారా అని ఎదురు చూసే వారికి ఈ అనుభవం అంకితం)*

★